సాక్షి చిత్తూరు

సోమవారం । 24 । ఏప్రిల్ । 2023



కాణిపాకంలో గాలీవాన

ఐరాల మండలం కాణిపాకంలో ఆదివారం గాలీవాన బీభత్సం సృష్టించింది. చెట్లు విరిగి పోగా, రేకులు ఎగిరిపోయాయి. –8లో



తిరుమలలో వర్షం

శ్రీవారి భక్తుల రద్దీతో కిటకిటలాడుతున్న ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం తిరుమల ఆదివారం కురిసిన వర్షంలో తడిసి ముద్దయింది.

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	36	26
తిరుపతి	36	26
తిరుమల	32	22
గూడూరు	37	28
నగరి	37	27

న్యూస్‌రీల్

కోనేటి రాయని బ్రహ్మోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ



వార్షికోత్సవ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పలమనేరు: నియోజకవర్గంలోని గంగవరం మండలం కీలపట్ల కోనేటి రాయని ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల పోస్టర్లను టీటీడీ బోర్డు సభ్యులు పోకల ఆశోక్‌కుమార్, స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ సతీమణి పావని ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, స్థానిక నాయకులతో కలసి ఆదివారం ఆవిష్కరించారు. ఈ నెల 30 నుంచి వచ్చేనెల 7వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర, నాయకులు చంద్రప్ప, ప్రహ్లాద, చలపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్షలు



చిత్తూరులో పరీక్ష కేంద్రం తనిఖీ చేస్తున్న జిల్లా కో–ఆర్డినేటర్ జయభారతి

చిత్తూరు కలెక్టరేట్ : డా.బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో అడ్మిషన్లకు ఆదివారం ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్ల పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా కో–ఆర్డినేటర్ జయభారతి చిత్తూరు, జీడీ నెల్లూరు మండలాల్లో పరీక్షల నిర్వహణ తీరును పర్యవేక్షించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఐదవ తరగతి ప్రవేశాలకు 1,256 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 992 మంది పరీక్షలకు హాజరయ్యారని చెప్పారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు 1253 మంది దరఖాస్తు చేసుకోగా 977 మంది హాజరయ్యారని తెలిపారు.

కాణిపాకంలో రద్దీ



ఆలయంలో భక్తులతో నిండిపోయిన క్యూలైన్లు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. శని, ఆదివారాలు సెలవుదినాలు కావడంతో ఉదయం భక్తుల తాకిడి మొదలైంది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

వైభవంగా బసవేశ్వర జయంతి



ఊరేగుతున్న బసవేశ్వర స్వామి

గుడుపల్లె: జగజ్జ్యోతి బసవేశ్వర స్వామి జయంతి వేడుకలను గుడుపల్లెలో వీరశైవ జంగమ సంఘం వారు ఆదివారం వైభవంగా నిర్వహించారు. బసవేశ్వర చిత్ర పటాన్ని ప్రత్యేకంగా అలంకరించి, ట్రాక్టర్‌లో ఉంచి ఊరేగించారు. స్థానిక రైల్వే స్టేషన్ క్రాస్ నుంచి బస్టాండ్ వరకు ఊరేగించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వీరశైవ జంగమ అధ్యక్షులు వీరశేఖరయ్య ప్రకాష్, రేణుక రాజ్, గుణేష్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 19 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 72,631 మంది స్వామివారిని దర్శించుకోగా.. అందులో 38,529 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.85 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

గుండె గుడి

శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయం.. చిరు గుండెలకు స్పందనగా మారింది. చిరు ప్రాయంలోనే ప్రాణాపాయంతో కొట్టుమిట్టాడే వారికి పునర్జన్మను ప్రసాదిస్తోంది. హృదయమార్పిడి శస్త్రచికిత్సను సైతం ఉచితంగా నిర్వహిస్తూ నిరుపేద చిన్నారులకు ఊపిరిపోస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రికగా అమూల్యమైన సేవలందిస్తోంది. ప్రస్థానం ప్రారంభించిన అనతికాలంలోనే దేశ వ్యాప్తంగా కీర్తిపతాకను ఎగురవేస్తోంది. వందలాది కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది.



- గుండె మార్పిడికి చిరునామా శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయం
- ఇప్పటి వరకు విజయవంతంగా మూడు ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్లు
- ఆరోగ్యశ్రీ కింద ఉచితంగానే రూ.లక్షల విలువైన సేవలు
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను నెరవేరుస్తున్న వైద్యులు



తిరుపతి శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయం వద్ద పోలీసులు

సాక్షి, తిరుపతి : నిరుపేద కుటుంబాలకు చెందిన చిన్నారులు ఎంతోమంది గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. రూ.లక్షలు వెచ్చించి ఆపరేషన్లు చేయించుకోలేక పోయేవారు. ఆర్థిక స్తోమత లేక కళ్లెదుటే కన్నబిడ్డ ఊపిరి వదిలేస్తుంటే తల్లిదండ్రులు బాధ వర్ణనాతీతంగా ఉండేది. ఈ పరిస్థితులను గమనించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహోన్నత నిర్ణయానికి శ్రీకారం చుట్టారు. తిరుపతిలో చిన్నపిల్లల గుండె ఆస్పత్రి ఏర్పాటు చేయాలని సంకల్పించారు. ఈ మేరకు ఆస్పత్రి బాధ్యతలను తిరుమల తిరుపతి దేవస్థానాలకు అప్పగించారు. వెంటనే టీటీడీ సైతం స్పందించి శరవేగంగా శ్రీపద్మావతి కార్డియాక్ కేర్ సెంటర్ నిర్మాణం చేపట్టింది. 2021 సెప్టెంబర్ 11వ తేదీన ఈ ఆస్పత్రిని ముఖ్యమంత్రి చేతులమీదుగా ప్రారంభించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీపద్మావతి హృదయాలయాన్ని తన మానసపుత్రికగా ప్రకటించారు. పేద పిల్లల ప్రాణాలకు భరోసా కల్పించారు.

తొలి ఆపరేషన్ ఇలా..

తిరుపతిలోని టీటీడీ శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో ఈ ఏడాది జనవరి 20వ తేదీన తొలిసారి గుండె మార్పిడి శస్త్ర చికిత్స చేశారు. విశాఖలో జనవరి 16వ తేదీన రోడ్డు ప్రమాదంలో గాయపడిన జంజూరు సన్యాసమ్మ (48)కు బ్రెయిన్ డెడ్ అయ్యింది. ఆమె బంధువులు షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో అవయవదానం చేశారు. ఆమె గుండెను ప్రత్యేక విమానంలో పటిష్ట బందోబస్తుతో గ్రీన్‌చానల్ ద్వారా రేణిగుంట విమానాశ్రయానికి అక్కడి నుంచి టీటీడీ అంబులెన్స్‌లో తిరుపతిలోని చిన్నపిల్లల హృదయాలయానికి తీసుకొచ్చారు. ఆస్పత్రిలో ప్రాణాపాయంతో కొట్టుమిట్టాడుతున్న అన్నమయ్య జిల్లా చిట్వేల్ మండలం కేఎస్‌ఆర్ అగ్రహారం గ్రామానికి చెందిన చెందిన 15 ఏళ్ల బాలుడికి వైద్యులు అత్యంత నైపుణ్యంగా ఆపరేషన్ చేసి గుండెను అమర్చారు. ప్రస్తుతం ఆ బాలుడు ఆరోగ్యంగా ఉన్నాడు. మరో నెల వ్యవధిలోనే 13 నెలల చిన్నారికి గుండె మార్పిడి చేసి హృదయాలయ వైద్యులు ప్రశంసలందుకున్నారు. గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన 13నెలల పాపకు గుండె దెబ్బతింది. తల్లిదండ్రులు విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పాపకు గుండె మార్చాలని డాక్టర్లు చెప్పడంతో శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయం గురించి తెలుసుకుని తిరుపతికి తీసుకువచ్చారు. పాపకు సరిపోయే గుండె కోసం వైద్యులు జీవన్ దాన్‌లో రిజిస్టర్ చేశారు. మందులు ఇస్తూ పాపప్రాణాలను కాపాడుతూ వచ్చారు. చెన్నై ఎంజీఎం ఆస్పత్రిలో రెండేళ్ల బాలుడుకి బ్రెయిన్ డెడ్ అయ్యింది. బాబు గుండెను దానం చేయనున్నట్లు సమాచారం అందుకున్న పద్మావతి చిన్నపిల్లల ఆస్పత్రి డైరెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి అక్కడి వారితో మాట్లాడారు. వైద్య బృందంతో సమన్వయం చేసుకుని ఫిబ్రవరి 27వ తేదీన టీటీడీ ప్రత్యేక అంబులెన్స్ ద్వారా 2 గంటల 15 నిముషాల్లో చెన్నై నుంచి తిరుపతికి గుండెను తరలించారు. వెంటనే పాపకు గుండె మార్పిడి శస్త్ర చికిత్స చేసి పునర్జన్మనిచ్చారు. దాదాపు రూ.30 లక్షలు ఖర్చు అయ్యే గుండె మార్పిడి శస్త్ర చికిత్సను రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చేయించడం విశేషం.



విశాఖపట్టణం నుంచి తిరుపతికి గుండెను తీసుకొస్తున్న వైద్య బృందం

హృదయ స్పందన..

- మల్లారెడ్డి కిరణ్‌చంద్ వయసు : 16 ఏళ్లు
- బ్రెయిన్ డెడ్ : ఇంట్రాక్రానియల్ ట్యూమర్
- గుండె గ్రహీత : రితిశ్రీ (ఐదేళ్లు)
- రోగం : డైలేటెడ్ కార్డియోమయోపతి
- శ్రీకాకుళం నుంచి వైజాగ్ రోడ్డు మార్గం : 115 కిలోమీటర్లు
- చేరుకున్న సమయం : 90 నిమిషాలు
- వైజాగ్ నుంచి రేణిగుంట విమానాశ్రయం : 95 నిమిషాలు
- రేణిగుంట నుంచి తిరుపతి చిన్నపిల్లల హృదయాలయం : 24 నిమిషాలు
- హృదయాలయానికి గుండె చేరిన సమయం : సాయంత్రం 6.45 గంటలు

అందరూ అలెర్ట్..

శ్రీకాకుళంలో బ్రెయిన్ డెడ్ అయిన బాలుడి అవయవాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చిన విషయం తెలుసుకున్న సీఎంఓ అధికారులు వెంటనే శ్రీకాకుళం, విశాఖపట్నం, తిరుపతి జిల్లాల ఎస్పీలను అలెర్ట్ చేశారు. గుండెను వాహనంలో తరలించే మార్గాన్ని గ్రీన్ చానల్‌గా ప్రకటించి బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో తిరుపతిలోని శ్రీ పద్మావతి కార్డియాక్ కేర్ సెంటర్ వైద్యుల బృందం శనివారం రాత్రే శ్రీకాకుళం బయలుదేరి వెళ్లింది. బాలుడి గుండెను సేకరించి తిరుపతికి తీసుకువచ్చింది. అప్పటికే చిన్నారి రితిశ్రీని ఆపరేషన్ థియేటర్లో సిద్ధం చేయడంతో గుండె చేరుకోగానే వెంటనే ఆపరేషన్ ప్రక్రియను ప్రారంభించింది.

వడివడిగా అడుగులు..



ఆస్పత్రి వద్దకు ప్రత్యేక అంబులెన్స్‌లో గుండెను తీసుకొస్తున్న దృశ్యం

శ్రీపద్మావతి హృదయాలయం వడివడిగా అడుగులు వేస్తూ విజయ పథంలో ముందుకు సాగుతోంది. ఇక్కడి వైద్యులు సైతం సేవాభావంతో విధులు నిర్వర్తిస్తూ ప్రభుత్వ ఆశయాన్ని నెరవేరుస్తున్నారు. అనతికాలంలో 1,350కు పైగా గుండె సంబంధిత శస్త్రచికిత్సలను పూర్తి చేశారు. ముఖ్యంగా గుండె మార్పిడి ఆపరేషన్లను దిగ్విజయంగా నిర్వహిస్తూ ఆస్పత్రికి ఎనలేని కీర్తిప్రతిష్ఠలను తీసుకువచ్చారు. ఇప్పటి వరకు 3 హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్ శస్త్రచికిత్సలను సక్సెస్ చేశారు. తాజాగా ఆదివారం నెల్లూరుకు చెందిన ఓ చిన్నారికి గుండె మార్పిడి చేశారు. శ్రీకాకుళంలో బ్రెయిన్ డెడ్ అయిన బాలుడి గుండెను ప్రత్యేక ఎయిర్ అంబులెన్స్‌లో ఆదివారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయానికి తీసుకొచ్చారు. అనంతరం రోడ్డు మార్గంలో అత్యంత జాగ్రత్తల నడుమ నిముషాల వ్యవధిలోనే శ్రీపద్మావతి చిన్నపిల్లల ఆస్పత్రికి తరలించారు. విజయవంతంగా గుండె మార్పిడి శస్త్రచికిత్సను పూర్తి చేశారు.



ఆస్పత్రి వద్ద గుమికూడిన ప్రజలు



రితిశ్రీ తల్లిదండ్రులు

స్పందనలో వీడియో కాన్ఫరెన్స్

చిత్తూరు కలెక్టరేట్ : ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ సగిలి షణ్మోహన్ స్పందన కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఈ నెల 24న కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందనలో తొలిసారిగా అమలు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌వో రాజశేఖర్ ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తారు. ఆ వినతుల పరిష్కారానికి అప్పటికప్పుడే వీడియో కాన్ఫరెన్స్ విధానంలో క్షేత్రస్థాయి అధికారులతో మాట్లాడనున్నారు. బాధితుల సమక్షంలోనే సంబంధిత సమస్య పరిష్కరించేందుకు కృషి చేయనున్నారు. ఈ నూతన విధానంపై ఇప్పటికే క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు.



స్పందనలో అర్జీదారుని సమస్యను వింటున్న కలెక్టర్ షణ్మోహన్(ఫైల్)

నేడు పోలీసు కార్యాలయంలో స్పందన

చిత్తూరు అర్బన్: నగరంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ వై.రిశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని, ఏవైనా సమస్యలుంటే నేరుగా తనను కలిసి మాట్లాడొచ్చని ఆయన పేర్కొన్నారు.

కార్పొరేషన్ కార్యాలయంలో..

చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు కమిషనర్ అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఇంటి నుంచే కార్పొరేషన్ కాల్ సెంటర్ 08572232745, వాట్సప్ – 98499 07885 కు సమస్యలు తెలియచేయవచ్చన్నారు.

ఆధ్యాత్మిక సొబగులు.. అభివృద్ధి వెలుగులు



నాగాలమ్మ ఆలయ కుంభాభిషేక పూజల్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, స్వర్ణలతమ్మ దంపతులు, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తదితరులు




రామాపురంలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు : సత్యవేడు నియోజకవర్గంలోని పిచ్చాటూరు, నాగలాపురం మండలాల్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం పర్యటించారు. పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో ముందుగా ఉదయం 9 గంటలకు మంత్రి పెద్దిరెడ్డి, స్వర్ణలతమ్మ దంపతులు స్వయంభు నాగాలమ్మ ఆలయానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంతో కలిసి ఆలయ విమానగోపుర కుంభాభిషేకంలో పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ రేఖ, సింగిల్‌విండో చైర్మన్ హరిశ్చంద్రారెడ్డి, ఆలయ ధర్మకర్త వి.నాగరాజు ఆధ్వర్యంలో మంత్రి పెద్దిరెడ్డి దంపతులను సత్కరించారు. అనంతరం రామాపురం చేరుకుని రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ క్రమంలోనే సురుటపల్లెలో వెలసిన మంగళాదేవి సమేత పళ్లికొండేశ్వరాలయంలో నిర్వహిస్తున్న గురు సంచార పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందించి, ఆశీర్వదించారు. మంత్రి దంపతులు, ఎమ్మెల్యేను ధర్మకర్తల మండలి చైర్మన్ ఏపీఎం బాలాజీరెడ్డి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు విష్ణుప్రియ, నేతలు అపరంజిరాజు, గవర్ల కృష్ణయ్య, దయాకర్ రెడ్డి, సుశీల్ కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, సర్పంచ్ కేజీ రోస్‌రెడ్డి, తాడిపత్రి నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు బీరేంద్ర వర్మ, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు చిన్నదొరై, ట్రేడ్ యూనియన్ చైర్మన్ సురేష్, ముత్తరాసి కార్పొరేషన్ డైరెక్టర్ ధనంజయ రెడ్డి పాల్గొన్నారు.

నీట్‌గా సర్టిఫికెట్ల సెట్

విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా సర్టిఫికెట్ల పంపిణీ ప్రక్రియను ప్రభుత్వం నీట్‌గా సెట్ చేసింది. పోటీపరీక్షలకు దరఖాస్తు చేసుకోవడానికి కౌన్సెలింగ్‌కు అవసరమయ్యే కుల, ఆదాయ సర్టిఫికెట్ల జారీలో ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. దరఖాస్తు చేయకుండానే విద్యార్థులకు ఈ ధ్రువపత్రాలు అందించాలన్న నిబంధన తీసుకొచ్చింది. టెన్త్, ఇంటర్ పరీక్ష రాసిన ప్రతి విద్యార్థి ఇంటి వద్దకే వెళ్లి ఈ సర్టిఫికెట్లు జారీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీనిపై జిల్లా యంత్రాంగం ఆ విధానాన్ని అనుసరించి సర్టిఫికెట్ల పంపిణీ కసరత్తు నిర్వహించింది.

- విద్యార్థుల చెంతకే రెవెన్యూ యంత్రాంగం
- ఇంటి వద్దనే కుల, ఆదాయ ధ్రువపత్రాల జారీ
- ప్రవేశ పరీక్షలు రాసే వారికి వరం



చిత్తూరు తహసీల్దార్ కార్యాలయం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ప్రతి సంవత్సరం పది, ఇంటర్ చదువులు పూర్తి చేసే విద్యార్థులు వేల సంఖ్యలో ఉంటున్నారు. పదో తరగతి పూర్తి చేసే విద్యార్థులు ఉన్నత చదువుల అడ్మిషన్లకు, ఇంటర్ పూర్తి చేసే విద్యార్థులు నీట్, ఎంసెట్ తదితర పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకుంటారు. వీరికోసం గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక సంస్కరణలను తీసుకొచ్చింది. అందులో భాగంగానే విద్యార్థులు అసలు దరఖాస్తు చేయకుండానే సర్టిఫికెట్లు జారీ చేసే సరికొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది.

విద్యార్థుల ఇళ్ల వద్దకే..

చిత్తూరు జిల్లా పరిధిలోని 31 మండలాల్లో 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి, 26,854 మంది టెన్త్ పరీక్షలు రాశారు. 14,472 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరయ్యారు. ఆయా శాఖల నుంచి సేకరించిన నివేదికల ప్రకారం విద్యార్థులు దరఖాస్తులు చేయకుండానే కుల, ఆదాయ సర్టిఫికేట్‌లు జారీ చేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోంది. జిల్లాలోని ఆయా మండలాల తహసీల్దార్ల పర్యవేక్షణలో వీఆర్‌వోల పరిశీలన ద్వారా కసరత్తు పకడ్బందీగా నిర్వహించారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ యంత్రాంగమే విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి పరిశీలన పూర్తి చేసింది. అనంతరం నిబంధనల ప్రకారం ప్రత్యేక యాప్ ద్వారా సర్టిఫికెట్లను ఆమోదించే ప్రక్రియ నిర్వహించింది.

ముడుపుల మాటే లేదు

అత్యవసరంగా సర్టిఫికెట్లు పొందాలన్న ఆత్రుతలో దరఖాస్తు చేసుకుని రెవెన్యూ అధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరగాల్సిన పనిలేదు. సర్టిఫికెట్ల కోసం ఎవ్వరికీ ముడుపులు ఇవ్వాల్సిన అవసరమేలేదు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకున్న రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో కుల ఆదాయ ధ్రువపత్రాలను అందజేసేందుకు చర్యలు చేపట్టింది. ఈ విధానం ద్వారా విద్యార్థులకు దరఖాస్తు ఖర్చుతో పాటు, వ్యయప్రయాసలకు తావులేకుండా చేసింది.

ఇంటికే తెచ్చిచ్చారు




నా కొడుకు జగత్‌కిషోర్ బలిజకండ్రిగ హైస్కూల్లో పదో తరగతి పూర్తి చేశారు. ఫలితాలు రాగానే ఇంటర్మీడియట్‌లో చేర్పించాలనుకుంటున్నాను. అయితే మేము దరఖాస్తు చేయకుండానే తహసీల్దార్ కార్యాలయం నుంచి వచ్చిన అధికారులు జగత్ కిషోర్‌కు చెందిన కుల, ఆదాయ ధ్రువపత్రాలను తెచ్చిచ్చారు. అసలు మేము ఊహించనేలేదు. ఈ ప్రభుత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటాం. – మునెమ్మ, శ్రీకావేరిరాజుపురం, పాలసముద్రం

దరఖాస్తు చేయకుండానే..



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పకడ్బందీ కసరత్తు పూర్తి చేశాం. జిల్లా వ్యాప్తంగా పది, ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోకుండానే కు కుల, ఆదాయ సర్టిఫికెట్లను అందజేస్తున్నాం. వీఆర్‌వోలు ఇచ్చిన నివేదికల ప్రకారం క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత సర్టిఫికేట్‌లు జారీ చేస్తున్నాం. ఈ విధానం విద్యార్థులకు బాగా ఉపయోగపడుతోంది. – పులి శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్, చిత్తూరు

బోయకొండ కిటకిట



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

చౌడేపల్లి: భక్తులపాలిట వరాలిచ్చే ఆరాధ్య దైవంగా పేరొందిన బోయకొండ అమ్మవారి దీవెనల కోసం భక్తులు అధిక సంఖ్యలో ఆది వారం తరలివచ్చారు. రెండు రోజులుగా వరుస సెలవులు రావడం, పదో తరగతి, ఇంటర్మీడియట్ తదితర పరీక్షలు ముగియడంతో బోయకొండ భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారిని రంగురంగుల పూలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు పిండి, నేతిదీపాలు, దీవెనలతో మేళతాళాల నడుమ అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఆలయ ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో అమ్మవారి తీర్థ ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. ఎస్‌ఐ రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు నిఘా ఏర్పాటుచేశారు.



బోయకొండ ఆలయంలో భక్తుల రద్దీ

క్లుప్తంగా

దారి విషయమై ఘర్షణ

ఐరాల: ఇంటి దారి విషయమై ఓ వ్యక్తి కత్తితో దాడి చేయగా నలుగురికి గాయాలైన ఘటన మండలంలోని కుమ్మరపల్లెలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు, కుమ్మరపల్లెకు చెందిన గురప్ప ఆచ్చారి, గోవిందాఆచ్చారి ఇంటి దారి విషయమై ఇరువర్గాల మధ్య వివాదం చోటుచేసుకుంది. మాటామాటా పెరిగి గురప్పఆచారి కొడుకు రాజేష్, వల్లెమ్మ, వనమ్మ, పృథ్వి, గోవిందాఆచారిపై కత్తితో దాడి చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయాలైన నలుగురిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

నృసింహుని బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

రాపూరు : మండలంలోని పెంచలకోనలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామివారికి మే 1వ తేదీ నుంచి నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు ఆలయ అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీవారి రాజగోపురాన్ని విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో, భక్తులు నడిచే మార్గలంలో చలువ పందిళ్ల వేయిస్తున్నారు.

అబలకు అండగా తపాలా

- మహిళ సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్‌తో ఆర్థిక చేయూత
- రూ.1000 నుంచి రూ.2 లక్షల వరకు డిపాజిట్‌కు అవకాశం
- తపాలాశాఖ కొత్త పథకం


చిత్తూరులోని ప్రధాన తపాలా కార్యాలయం

చిత్తూరు కార్పొరేషన్: తపాలాశాఖ మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ అనే కొత్త పథకం అమల్లోకి తెచ్చింది. అప్పుడే పుట్టినవారి నుంచి మహిళలందరూ ఈ పథకంలో చేరేందుకు అవకాశం కల్పించింది. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌లో ఈ పథకాన్ని ప్రత్యేకంగా చేర్చారు.

ఉపయోగకరం

మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకం వన్‌టైం సేవింగ్స్ స్కీం. ఇది 2025 మార్చి 31 వరకు మాత్రమే అమల్లో ఉంటుందని తపాలాశాఖ ప్రకటించింది. ఈస్కీంలో చేరే అమ్మాయిలు, మహిళలు కనిష్ట పెట్టుబడి రూ.1000 మొదలుకొని రూ.2 లక్షల వరకు డిపాజిట్ చెల్లించవచ్చు. గరిష్ట మొత్తానికి రూ.2 లక్షలు లోబడి ఎన్ని ఖాతాలైనా తెరిచే అవకాశాన్ని కల్పించింది. ఇప్పటికే ఖాతా ఉన్నట్లయితే కనీసం మూడు నెలల టైం గ్యాప్‌తో మళ్లీ ఖాతా తెరవచ్చు. ప్రారంభించిన తేదీ నుంచి రెండేళ్లు పూర్తయిన తర్వాత మెచ్యూరిటీ కింద డబ్బు డ్రా చేసుకోవచ్చు. అయితే వడ్డీ రేటు మాత్రం ఏడాదికి 7.5 శాతం ఉంటుంది. అయితే ఒకరి పేరుతోనే ఖాతా తెరవాలి. జాయింట్ అకౌంట్ సౌకర్యం లేదు.

ఏడాది తర్వాత

మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ కింద డిపాజిట్ చేసిన వారు ఏడాది తర్వాత 40 శాతం డబ్బు ఉపసంహరించుకునే వీలు కూడా ఉంది. ఏ కారణాలతో అయినా డిపాజిటర్ మరణించినా లేదా కారుణ్యం కింద ఖాతా మూసేయవచ్చు. 2 శాతం తగ్గించుకుని (5.5 శాతం వడ్డీతో) ఆరు నెలల తర్వాత ఎప్పుడైనా ఖాతాను మూసివేయవచ్చు.

కావాల్సిన పత్రాలు

మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ స్కీంలో చేరాలంటే ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, మూడు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు తీసుకొని సమీపంలోని పోస్టాఫీసుకు వెళ్లి ఖాతా తెరవచ్చు.

చెల్లింపు	రెండేళ్ల తర్వాత వచ్చేమొత్తం
రూ.1000	రూ.1154
రూ.10,000	రూ.11,542
రూ.50,000	రూ.57,714
రూ.1,00,000	రూ.1,15,428
రూ.2,00,000	రూ.2,30,854

ప్రచారం లేక స్పందన రాక

కొత్తగా ప్రవేశపెట్టిన మహిళా సమ్మాన్ సేవింగ్స్ స్కీంకు సంబంధించి పట్టణ ప్రాంతాల నుంచి కొంత వరకు స్పందన వస్తోందని తపాలాశాఖ వర్గాలు చెబుతున్నాయి. అయితే గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవగాహన లేకపోవడం, సరైన ప్రచారం చేయకపోవడంతో ఎవరు ముందుకు రావడం లేదని చెబుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ పథకంపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు అన్నిశాఖల అధికారుల సహకారం తీసుకుంటున్నాం. దీనికి తోడు కరపత్రాలు, గోడ పత్రికలను సైతం గ్రామీణ ప్రాంతాల్లోని సిబ్బంది అందజేశాం. స్కీంపై అవగాహన కల్పించాలని ఆదేశించాం.

- చెన్నకేశవులు, సీనియర్ సూపరింటెండెంట్, తపాలాశాఖ


చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,200
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,500

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.78

బాలిక అదృశ్యం

సోమల: మండలంలోని ఆవులపల్లె పంచాయతీ రాంపల్లెకు చెందిన బాలిక(17) శనివారం రాత్రి 10 గంటలకు ఇంట్లో నిద్రించిందని తెలిపారు. ఆదివారం ఉదయం 4:30 గంటల నుంచి కనిపించడం లేదని బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ దేవరాజులు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తిరుపతి రూరల్ : చంద్రగిరి నూకలగుంట సమీపంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శనివారం అర్ధరాత్రి పోలీసులు దాడి చేశారు. శోభన్‌కుమార్, సతీష్, జ్ఞానేంద్ర, పట్టాభిరెడ్డి, రాజేంద్రరెడ్డి, లోకేష్ అనే పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.78,650, ఐదు సెల్‌ఫోన్లు, బైక్‌లను సీజ్ చేసినట్లు సీఐ ఓబులేసు తెలిపారు.

శాస్త్రోక్తం.. అష్టోత్తర శత శంఖాభిషేకం


ధూపదీప నైవేద్యాలు సమర్పిస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి:ముక్కంటి ఆలయంలోని శ్రీమేధా దక్షిణామూర్తిస్వామివారికి ఆదివారం శాస్త్రోక్తంగా అష్టోత్తర శత శంఖాభిషేకం నిర్వహించారు. గురు గ్రహం మీనరాశి నుంచి మేష రాశిలోకి ప్రవేశించిన సందర్భంగా విశేష అభిషేకం జరిపించినట్లు వేదపండితులు తెలిపారు. కరుణాకర్ గురుకుల ఆధ్వర్యంలో హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పంచ హారతులు, ధూప దీప నైవేద్యములు కైంకర్యం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని సేవించుకున్నారు. అభిషేక పూజలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు పాల్గొన్నారు.

న్యాయశాఖ సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న గోపినాథ్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: న్యాయశాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానని జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గోపినాథ్‌రెడ్డి పేర్కొన్నారు. చిత్తూరులోని పాత జిల్లా కోర్టు ప్రాంగణంలో ఆదివారం బార్ అసోసియేషన్ భవనంలో న్యాయశాఖ ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ న్యాయశాఖ ఉద్యోగులు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. నిబంధనల మేరకు బదిలీల నిర్వహణకు సంఘం తరపున చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీమారావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నామని తెలిపారు. అలాగే సంఘం కార్యవర్గం కాలం పొడిగింపు, ఉద్యోగుల బదిలీల సమస్యల పరిష్కారం అంశాలను తీర్మానించి ఆమోదించామని గోపినాథ్‌రెడ్డి తెలిపారు. కాగా ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయ శాఖ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గానికి ఎన్నికలు అనివార్యమయ్యాయి. సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటుకు సభ్యుల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. సమావేశంలో రాష్ట్ర నాయకు లు కె.వై. కృష్ణ, వేణుగోపాల్, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం, అసోసియేట్ అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్ష్మీపతి, కార్యవర్గ సభ్యులు, తిరుపతి, మదనపల్లె తాలుకాలకు చెందిన న్యాయశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత కల్పించే పార్టీకే మద్దతు

శ్రీకాళహస్తి : సార్వత్రిక ఎన్నికల్లో ప్రాధాన్యత కల్పించే పార్టీకే మద్దతు ఇస్తామని వడ్డెర సంఘం నేతలు తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో జిల్లా వడ్డెర సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా, రాజకీయంగా వెనుకబడిన వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అన్ని పార్టీల నేతలు సహకరించాలని కోరారు. రాష్ట్రంలో సుమారు 40లక్షల మంది వడ్డెర్లు ఉన్నా పాలకులు నిర్లక్ష్యం చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డెర్లు అభివృద్ధి చెందాలంటే చట్టసభల్లో అవకాశం కల్పించాలని కోరారు. జనాభా దామాషా ప్రకారం ఐదు అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలను వడ్డెర్లకు కేటాయించాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర వడ్డెర జేఏసీ చైర్మన్ వేముల సుబ్బారావు, వైస్ చైర్మన్ గుంజి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు తురక అమరనాథ్, ప్రధాన కార్యదర్శి కోనంగి శ్రీరాములు, వర్కింగ్ ప్రెసిడెంటు మల్లి శ్రీనివాసులు, కార్యనిర్వాహక కార్యదర్శి దేరంగుల శ్రీధర్, ఉపాధ్యక్షుడువలిపి శ్రీరాములు, నేతలు విజయకుమార్, తేపల్లె విజయ్ శ్రీనివాస్, జెరిపిటి జయరాం, గుంజి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ రాష్ట్ర స్థాయి విజేత 'చిత్తూరు'


విజేత ట్రోఫీ అందుకుంటున్న చిత్తూరు బాలుర జట్టు

రొళ్ల: రెండు రోజులుగా జరుగుతున్న 6వ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల సీనియర్ షూటింగ్ బాల్ క్రీడా పోటీలు ఆదివారం ముగిశాయి. విజేతలుగా బాలుర విభాగంలో చిత్తూరు, బాలిక విభాగంలో పశ్చిమ గోదావరి జిల్లా జట్లు నిలిచాయి. రన్నరప్‌ను బాలుర విభాగంలో ఎన్టీఆర్ జిల్లా, బాలికల విభాగంలో చిత్తూరు జిల్లా జట్లు దక్కించుకున్నాయి. అలాగే తృతీయ స్థానంలో కృష్ణా జిల్లా (బాలురు, బాలికల) జట్టు నిలిచింది. విజేతలకు ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి పరశురాముడు, పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ యోగానంద్, అనంతపురం జిల్లా షూటింగ్ బాల్ అసోషియేషన్ కార్యదర్శి నాగరాజు తదితరులు ట్రోఫీలను ప్రదానం చేశారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని జట్టుగా ఎంపిక చేసి మే నెలలో ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు పంపనున్నట్లు పరుశురాముడు తెలిపారు. కార్యక్రమంలో షూటింగ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా టెక్నికల్ కమిటీ సభ్యుడు, టోర్నీ డైరెక్టర్ రఫీక్ మహమ్మద్, రాష్ట్ర కోశాధికారి విజయ్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మురళి, అనిల్‌కుమార్, కార్యవర్గ సభ్యుడు గణేష్, అనంతపురం అసోషియేషన్ కోశాధికారి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి దివ్యాంగుడి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తవణంపల్లె: అడవి పందుల వేట కోసం అమర్చిన కరెంటు తీగలు తగిలి ఆదివారం దివ్యాంగుడు మృతి చెందిన ఘటన స్థానికంగా విషాదాన్ని మిగిల్చింది. ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి కథనం మేరకు, మండలంలోని ఎం.బోయపల్లెకు చెందిన నాగభూషణం పొలంలో అడవి పందుల కోసం వేటగాళ్లు కరెంటు తీగలు అమర్చినారు. అదే గ్రామానికి చెందిన సి.మేఘనాథం(39) దివ్యాంగుడు. మేత కోసం వెళ్లిన పశువులు శనివారం రాత్రి ఇంటికి రాకపోవడంతో ఆదివారం ఉదయం సుమారు 5 గంటల సమయంలో వెతకడానికి పొలాల్లోకి వెళ్లాడు. కరెంటు తీగ కాలికి తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో చిత్తూరు రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి ఏడాది క్రితం బంగారుపాళెం మండల, తుంబకుప్పంకు చెందిన మేనత్త మొగిలమ్మ కుమార్తె దీప(మూగ)తో వివాహమైంది. సంతానం లేదు. మృతుడి అన్న కొడుకు రెడ్డెప్ప ఫిర్యా దు మేరకు కేసు విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేటగాళ్ల భరతం పడతాం: సీఐ శ్రీనివాసరెడ్డి

మండలంలో వన్యప్రాణుల వేటగాళ్ల భరతం పడతామని చిత్తూరు రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, తవణంపల్లె ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి హెచ్చరించారు. కొంతమంది వేటగాళ్లు రాత్రుల్లో అడవి పందుల కోసం కరెంటు తీగలు అమర్చి వేట కొనసాగిస్తున్నారని, దీనిపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచినట్లు పేర్కొన్నారు. ఎం.బోయపల్లెలో అడవిపందుల వేట కోసం కరెంటు తీగలు అమర్చిన అనుమానితులను పిలిపించి విచారిస్తున్నట్లు వివరించారు. రెండు రోజుల్లో అడవి పందుల వేటగాళ్లను అరెస్టు చేస్తామని తెలిపారు.

రామానుజాచార్యుల అవతారోత్సవాలు ప్రారంభం


మాట్లాడుతున్న చిన్నజీయంగార్‌స్వామి

తిరుపతి కల్చరల్: అన్నమాచార్య కళామందిరంలో ఆదివారం సాయంత్రం టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో రామానుజాచార్యుల అవతారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తిరుమల చిన్నజీయంగార్‌స్వామి మంగళాశాసనాలు అందించారు. రామానుజాచార్యుల అవతార మహోత్సవాలను టీటీడీ ఘనంగా నిర్వహించడం సంతోషకరమన్నారు. అనంతరం తిరుపతికి చెందిన ఆచార్య రాజగోపాలన్ శ్రీరామానుజ వైభవం అనే అంశంపై ఉపన్యసించారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు రేవతి బృందం ఆలపించిన సంకీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్ ఏఈవో శ్రీరాములు, పాల్గొన్నారు.

కాణిపాకంలో గాలీవాన బీభత్సం


గాలీ వానకు కూలిన రేకుల షెడ్

కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ పరిసరాల్లో ఆదివారం సాయంత్రం గాలీ వాన బీభత్సం సృష్టించడంతో చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. రేకుల షెడ్ కూలిపోయింది. సాయంత్రం ఒక్క సారిగా ఆకాశంలో మేఘాలు కమ్ముకొని పెద్ద ఎత్తున గాలి వీయడంతో ఆలయ పరిసరాల్లో ఉన్న చెట్టు కొమ్మలు విరిగి నెల కొరిగాయి. రేకులతో నిర్మించుకున్న షెడ్ కూలిపోయింది. వర్షం మాత్రం తేలికగా కురిసింది. మామిడి, చింతకాయలు నేల రాలాయి. ఆలయ అధికారులు వెంటనే తమ సిబ్బందితో విరిగిన చెట్టు కొమ్మలను తొలగించి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. - కాణిపాకం(యాదమరి)


రాలిపోయిన చింతకాయలు


రహదారులలో విరిగి పడిన చెట్టు కొమ్మలు